

అపారిశుధ్యంగా వీధి కాలువ



ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని హైవే రోడ్డుకు ఆనుకొని ఉన్న ప్రధాన మెయిన్ రోడ్డు సెంటర్ వీధి కాలువలు అపారిశుధ్యంగా ఉండటంతో వర్షాకాలంలో వర్షపు నీరు ఒకే చోట నిల్వ ఉండి చెరువును తలపిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరంతా ఒకే చోట నిల్వ ఉండి పోతోంది. హైవే రోడ్డు నిర్మించారు. గాని గతంలో ఉన్న వీధి కాలువలను కొత్తగా నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షపు నీరంతా ఒకేచోట నిల్వ ఉండిపోతుంది. దీంతో దుర్వాసన రావడంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా వీధి కాలువలను కొత్తగా నిర్మించడంలో చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

అల్లూరి స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి కృషి

కలెక్టర్ దినేష్ కుమార్



పాడేరులో అల్లూరికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : బ్రిటిషు పాలకులను ఎదిరించి సాయుధ పోరాటానికి ఆదివాసి ప్రజలను సంసిద్ధం చేసిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ కొనియాడారు. విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరితో కలసి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అల్లూరి స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని, జిల్లాకి అటువంటి మహనీయుని పేరు పెట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.
పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ మాట్లాడుతూ అల్లూరి సీతారామ రాజు ఒక వ్యక్తికాదు మహోన్నత శక్తీ అని అన్నారు. సహాయ కలెక్టర్ కె.చిరంజీవి నాగ వెంకట సాహిత్ మాట్లాడుతూ, అతను ఒక వ్యక్తి కాదు ఒక ఆయుధం అన్నారు.మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ,శక్తి, యుక్తితో అల్లూరి సీతారామరాజు సాయుధ పోరాటం చేసారని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె పద్మలత, డ్వామా పిడి విద్యాసాగర్, పాడేరు మండల అధ్యక్షులు సోనారి రత్నకుమారి పాల్గొన్నారు.
పాడేరు టౌన్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128 జయంతి వేడుకలను ఐటిడిఎ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఐటిడిఎ ప్రాంగణంలో ఉన్న అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి, కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం.హేమలత, పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజు బాబు, ట్రైకార్ సహాయకులు ఎన్.సీతారామయ్య శుక్రవారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ మేనేజర్ పరంజ్యోతి, అధికారులు పాల్గొన్నారు.
రంపచోడవరం : స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో పిఒ కట్టా సింహాచలం అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. రంపచోడవరంలో స్థానిక డిగ్రీ పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కళాశాల ప్రిన్సిపల్ పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు వాసు, డిజె శ్రీనివాస్, డి.వి కిరణ్ నివాళులర్పించారు.

ఆదర్శంగా తీసుకోవాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర



నివాళి అర్పిస్తున్న సురేంద్ర తదితరులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అల్లూరి సీతారామరాజు ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని గిరిజన హక్కులు, చట్టాల కోసం పోరాడాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ. ఆదివాసులకు అడవి భూమి పై హక్కుగా ఉండాలని బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప పోరాట యోధుడు అల్లూరి అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేసా, 1/70 ,అటవి హక్కుల చట్టానికి వ్యతిరేకంగా 51 జిఒ విడుదల చేసిందని, వెంటనే రద్దు చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వంద శాతం ఉద్యోగ ఉపాధ్యాయ నియామక చట్టం తేవాలని, ఆదివాసీ గిరిజన స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, పాడేరు మెడికల్ కాలేజీ నిర్మాణాలు పూర్తి చేసి ఈ ఏడాది కాలేజీ సీట్లకు అనుమతి ఇవ్వాలన్నారు. గిరిజన సంక్షేమ హాస్టల్స్ లో ఆరోగ్య కార్యకర్తలను వెంటనే నియమించి,ఆదివాసీ విద్యార్థుల ఆరోగ్యా భద్రతా కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జన్ని భగత్ రామ్,రాజు, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి జి.బుజ్జిబాబు, నాయకులు కె రామారావు, గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్లాంట్‌పై పోరాటం

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనర్స



నివాళి అర్పిస్తున్న అప్పలనర్స, నాయకులు

పాడేరు: అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేకంగా ఆదివాసీ యువత ఉద్యమాలు నిర్వహించాలని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనరస పిలుపు నిచ్చారు. పాడేరు ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బాలదేవ్ అధ్యకత ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆదివాసుల అటవీ సంపద రక్షణకై కూడా అల్లూరి సీతారామరాజు పోరాటం చేశారని కొనియాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేయడం కోసం నూతన అటవీ పాలసీ, నూతన మైనింగ్ పాలసీ తీసుకొచ్చారన్నారు అల్లూరి జిల్లా పరిధిలో సుమారు 4 హైడ్రోపార్ ప్రాజెక్టులను అదాని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం కోసం పాలకులు ఆదివాసులు అన్యాయం చేస్తున్నారనీ ఆరోపించారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కు వ్యతిరేకం జరిగే ఉద్యమంలో ప్రజానీకంతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్, చిన్నరావు, కొర్ర బాలయ్య, కొర్ర నర్సయ్య శ్రీను కిల్ల సత్యనారాయణ. గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

ఎపి టూరిజాన్ని..

ప్రయివేటుకు అప్పగిస్తే ప్రతిఘటిస్తాం

ఎపి టూరిజం కాంట్రాక్ట్, మ్యాన్ పవర్, డైలీవేజ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన



నినాదాలు చేస్తున్న గంగరాజు, ఉమామహేశ్వరరావు, యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: 5వ షెడ్యూల్ ఏరియాలో ఉన్న ఏపీ టూరిజం కార్పొరేషన్ యూనిట్లను ప్రైవేటుకరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే పత్రికల్లో తెలిపిందని, ప్రైవేటీకరణకు నిరసనగా ఏపీ టూరిజం కాంట్రాక్ట్, మెన్ పవర్ , డైలీవేజ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం ఏపీ టూరిజం హరిత వ్యాలీ రిసార్ట్ ముందు కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గంగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఉన్న ఏపీ టూరిజం యూనిట్లు ప్రైవేటీకరణ చట్ట విరుద్ధమని, ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ,1/70 చట్టం అమల్లో ఉండగా ఏ విధంగా ప్రైవేటుకి ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో యోగ నిర్వహణ అధినేత రామ్ దేవ్ బాబా అరకులోయ పర్యటించి మయూరి రిసార్ట్‌ను ప్రైవేట్ పరం చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిసిందని అన్నారు. కోట్ల రూపాయలు లాభాలు వచ్చే టూరిజాన్ని ప్రైవేటు వ్యక్తులకు ఇస్తే ఊరుకునేది లేదని ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. గత కొంతకాలంగా ఏపీ టూరిజం పనిచేసే కార్మికులందరినీ పర్మిట్ చేసి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించకుండా దొడ్డిదారిన పాలకులు కమిషన్కు కక్కుర్తి పడి గిరిజన చట్టాల్ని తూట్లు పొడిచి ప్రైవేటు వ్యక్తులకి టూరిజం కార్పొరేషన్ యూనిట్లు కట్టబెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోమని తెలిపారు. తక్షణం ప్రైవేటుకరించే ఆలోచన విరమించి సంస్థ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అంజలిరావు, బాబురావు,ధర్మ,సురేష్, సంజీవరావు,లక్ష్మి, బుద్ధ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్‌ప్లాంట్ అనుమతులు రద్దు చేయాలి

-ఆదివాసీ గిరిజన సంఘం నేతల డిమాండ్ - జిఒ 51 కాపీలు దగ్ధం



జిఒ కాపీలు దగ్ధం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో పెద్దకోట అదానీ కంపెనీ హైడ్రో పవర్ ప్రాజెక్టు కు స్థానిక ఆదివాసీలను పెసా గ్రామసభకు సంప్రదించకుండా ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇస్తూ జిఒ నెంబర్ 51 ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని, దీన్ని తక్షణమే రద్దు చేయాలనీ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పాడేరు జిల్లా కేంద్రంలో మెయిన్ రోడ్డు పై జీఓ నెంబర్ 51 కాపీలు దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, పెద్దకోట హైడ్రో పవర్ ప్రాజెక్టు కెపాసిటీ 1800 మెగా వాట్స్ కు పెంచడమే కాకుండా, స్థానిక వాగు నుంచి 16.54 ఎంసీఎం నీటిని తరలించడానికి కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. పెద్దకోట ప్రాంతం, రాజ్యాంగం ఐదవ షెడ్యూల్ క్రింద నోటిఫై చేయబడిన ప్రాంతమని చెప్పారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, పెసా చట్టం ఆదివాసీలకు ప్రత్యేకమైన హక్కులు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్ష అనుమతులు జారీ చేసిందని విమర్శించారు.నీటిని ప్రాజెక్టు కోసం తరలించడం వల్ల ఆదివాసులకు తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. మానవ హక్కులకు భంగం కలుగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీగా ఉండవలసిన ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దాసోహం కావడం దారుణమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆదాని కార్పొరేట్ కంపెనీతో ఒప్పందం చేసుకుందని, నాడు అటువంటి నిర్ణయాలను ప్రజలు ప్రశ్నించారని అన్నారు ఆ నిర్ణయాన్ని ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం పరిశీలించకుండా, అదే అదానీ కంపెనీకి తిరిగి కట్టబెట్టడం దారుణమన్నారు. ప్రాజెక్టును రద్దు చేయాలనీ లేని పక్షంలో ఆదివాసీ ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు కొర్రా నర్సయ్య, కిల్లో సత్యనారాయణ, కొర్రా బాలయ్య,శ్రీను, వరహాలబాబు, చిన్నారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్ మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెల్లో గోదారి గుబులు..

పెరుగుతున్న నీటిమట్టంతో పరిసర గ్రామాల్లో ఆందోళన
గండిపోచమ్మ ఆలయం మూసివేత
దర్శనాలు నిలిపివేయాలని ఇఒ లక్ష్మీకుమార్ ఆదేశాలు
వాగులు దాటవద్దు : పిఒ సింహాచలం హెచ్చరిక



గండిపోచమ్మ ఆలయంలో చేరిన వరదనీటిని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- చింతూరు:
ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు క్రమేపి గోదావరి నది నీటిమట్టం పెరుగుతోంది. శుక్రవారం ఉదయం ఆరు గంటలకు గోదావరి నీటిమట్టం 14.40 అడుగులకు చేరుకుంది. దీంతో గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి నీటి మట్టం 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేయనున్నారు. గోదావరిలో పెరుగుతున్న వరద నీటితో శబరి నది ఎగపోటుకు గురైంది. శబరిలో నీరు దిగువకు నెమ్మదిగా ప్రవహిస్తోంది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో ఉన్న దుమ్ముగూడెం, తాళిపేరు ప్రాజెక్టుల్లో వరద నీరు పెరిగితే గోదావరి ప్రవాహం గణనీయంగా పెరుగుతుంది. ఇంకా ఎగువ ప్రాంతాల్లో బ్యారేజీలు నిండలేదు. ఒడిస్సా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు శబరి నది, దాని ఉపనది సీలేరు కూడా పెరిగే అవకాశం ఉంది. శబరిలో కొత్తనీరు చేరడంతో 10 నుండి 15 కిలోల భారీ చేపలు మత్స్యకారులకు లభిస్తున్నాయి. రోజుకు క్వింటా నుండి రెండు క్వింటాళ్ల వరకు చేపలు లభిస్తున్నాయి. శబరి చేపలు మంచి రుచిగా ఉండటంతో ప్రజలు ఎగబడి కొనుక్కుంటున్నారు. ఇప్పటికే అధికారులు కంట్రోల్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేశారు.

గండిపోచమ్మ అమ్మవారి ఆలయంలో దర్శనాలు నిలిపివేత

దేవీపట్నం : గోదావరిలో నీటిమట్టం క్రమేపి పెరుగుతోంది. దీంతో దేవీపట్నం మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండిపోచమ్మ తల్లి అమ్మవారి ఆలయంలోకి భారీగా వరదనీరు ప్రవేశించింది. శుక్రవారం దేవస్థాన, రెవెన్యూ, పోలీస్ అధికారులు అమ్మవారి ఆలయాన్ని పరిశీలించారు. అమ్మవారి ఆలయంలోకి భారీగా వరద నీరు రావడం వల్ల దర్శనాలు నిలిపివేస్తున్నట్లు ఇఒ లక్ష్మీకుమార్ ప్రకటించారు. కొద్ది రోజులుగా భారీగా కురిసిన వర్షాలకు గోదావరి నదిలో నీటిమట్టం పెరిగింది. మొదటగా అమ్మవారి మండపంలోకి నీరు ప్రవేశించిందని, తరువాత గర్భగుడిలోకి నీరు వచ్చినట్లు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం అధికారులు పరిశీలించారని, ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొన్నందున దర్శనాలు నిలిపి వేయాలని ఆదేశించినట్లు చెప్పారు. వరద తగ్గేంతవరకు భక్తులెవరినీ అనుమతించవద్దని, అదేవిధంగా భక్తులు కూడా దర్శనానికి రావద్దని సూచించారు.

కొండ వాగులు దాటొద్దు

రంపచోడవరం : ఏజెన్సీలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కాలువలు పొంగి ప్రవహిస్తాయని అటువంటి సమయంలో కాలువలు, వాగులు దాటవద్దని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం శుక్రవారం ఒక ప్రకటనలో ఏజెన్సీ ప్రజలను హెచ్చరించారు. ఏజెన్సీలో భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా వాగులు పొంగే ప్రమాదం ఉన్నందున ఏజెన్సీలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏజెన్సీలోని ఏడు మండలాల్లో వాగులు పొంగే సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ దాటవద్దని సూచించారు. అధికార యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని ఆయన తెలిపారు.

బొరుగుపల్లి, వయ్యాడు రోడ్డు వేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్



గిరిజనులతో మాట్లాడుతున్న గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: రాజవొమ్మంగి నుండి బొరుగుపల్లి, వయ్యాడు వెళ్లే ప్రధాన రహదారి నిర్మించాలంటూ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం లోతా రామారావు బొరుగుపల్లి, వైయ్యాడు గ్రామ గిరిజనులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను గిరిజనలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజవొమ్మంగి నుండి వయ్యాడు బూరుగుపల్లి వెళ్లే ప్రధాన రహదారి రాళ్లు పైకి లేచిపోయి రహదారి బురదమయంగా మారిందని వారంతా తమ అవసరాల నిమిత్తం రాజవొమ్మంగి ప్రధాన కేంద్రానికి రావాలంటే వర్షాకాలంలో అత్యవసర పరిస్థితుల్లో గిరిజనులు బయటకు రాని పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇటీవల రహదారి కొంతమేర వేసి మధ్యలోనే వదిలేశారని, తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రహదారి బాగుచేయాలని డిమాండ్ చేశారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చినబాబు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని జడ్డంగి ఎస్ఐ చినబాబు అన్నారు. శుక్రవారం కొమరాపురం గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. యువతకు సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. గంజాయి, నాటుసారా రవాణా చేసినా, విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పెద్దగెద్దాడ పిహెచ్‌సి పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ సింహాచలం

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒకట్టా సింహాచలం పేర్కొన్నారు. శుక్రవారం రంపచోడవరం మండలం పెద్దగెద్దాడ పిహెచ్‌సిని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఎంతమంది వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారో పరిశీలించారు. ప్రతిరోజూ ఎంతమంది పేషెంట్లు వస్తున్నారన్న విషయం కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు సంబంధించి మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని, ఎవరైనా జ్వరాలతో వస్తే వారికి వెంటనే రక్తనమునాలు స్వీకరించి ఆయావ్యాధులకు ఉచిత మందులు అందజేయాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆనేపల్లి గ్రామాన్ని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో త్రాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని పిఒను కోరారు. ఆయన స్పందించి తాగునీరు పరీక్షించి ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం రంపచోడవరంలో పాత ఆంధ్ర బ్యాంకు సమీపంలో అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆహారం అందించాలని విద్యను బోధించాలన్నారు. అడిషనల్ డిఎంహెచ్ఒ శిరీష పాల్గొన్నారు.

ఎంపిడిఒగా శ్రీనివాసరాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - వై రామవరం: ఎంపిడిఒగా శ్రీనివాస్‌రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగానే కాజులూరు మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతి పై డిప్యూటి ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇప్పటివరకు పనిచేసిన బి.శివకుమార్ విస్సన్నపట్నం ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ అయ్యారు.

సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సూరిబాబు

ప్రజాశక్తి - కొయ్యూరు : కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని సిపిఎం, సిఐటియు జిల్లా నాయకుడు ఎస్.సూరిబాబు డిమాండ్ చేశారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలన్నారు. గురువారం కొయ్యూరులో మండల నాయకులతో ప్రచారం చేశారు. సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించారు.

డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - చింతూరు: స్థానిక చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీ అధ్యాపక పోస్టుల్లో తాత్కాలిక ప్రాతిపదికన అతిథి అధ్యాపకుల నియామకానికి కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, జంతుశాస్త్రం, గణితం, కామర్స్, చరిత్ర, తెలుగు, ఇంగ్లీష్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ 55 శాతం మార్కులతో పూర్తి చేసిన వారు అర్హులన్నారు. పిహెచ్‌డి లేదా యూజిసి, నెట్, ఎపిసెట్ అదనపు అర్హతలు గలవారికి, బోధనానుభవం గల వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలతో 11వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కళాశాల కార్యాలయంలో వారి దరఖాస్తులను అందజేయాలన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు 14వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ, డెమోక్లాస్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. అదనపు సమాచారం కోసం 9949229236 మరియు 9949693880 నంబర్లను సంప్రదించవచ్చునన్నారు.


సుపరిపాలన కూటమి ప్రభుత్వంతో సాధ్యం



రాజవొమ్మంగిలో కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: రాష్ట్రంలో సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. రాజవొమ్మంగిలో గురువారం టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు అధ్యక్షతన ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తిరిగి పథకాలు ప్రజలకు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిసిసి డైరెక్టర్ గొర్లె సునీత, పార్టీ మండల నాయకులు ముప్పన సావిత్రి, మోహన్, షేక్ బాబ్జి, సత్తిబాబు, జెట్టి మధు, ఎం శ్రీను పాల్గొన్నారు.
చింతూరు : చింతూరు మండల టిడిపి కార్యాలయంలో శుక్రవారం రంపచోడవరం నియోజకవర్గ మిరియాల శిరీషదేవి ఆదేశాల మేరకు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై బూత్ యూనిట్ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి బూత్‌లోని సభ్యులు డోర్‌టుడోర్ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. మండల అధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి క్లస్టర్ ఇన్‌చార్జ్ ఓబిల్లనేని నరసింహారావు, కో క్లస్టర్ పొదిలి రామారావు నాయకులు మల్లెల వెంకటేశ్వరరావు, యూనిట్ ఇంచార్జ్‌లు ముత్యాల శ్రీరామమూర్తి, శీలం తమ్మయ్య. బూత్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

కాఫీ తోటల్లో..
ఉడెన్ వ్యూ పాయింట్ ఏర్పాటుకు వినతి



వినతిపత్రాన్ని ఇస్తున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి- అనంతగిరి: అనంతగిరి మండలం ఎగువశోభ పంచాయితీ పరిధి అనంతగిరి కాఫీ ప్లాంటేషన్ వ్యూ పాయింట్ 77వ బ్లాక్‌లో టూరిజం కేంద్రంగా ఉడెన్ వ్యూ పాయింట్ నిర్మించాలని పాడేరు ఏపీ ఎఫ్ డి సి డివిజనల్ మేనేజర్ కృష్ణబాబుకు వినతి పత్రం అందించినట్లు అనంతగిరి జడ్పిటిసి దీసరి .గంగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శుక్రవారం మండలంలో పర్యటనకు వచ్చిన ఆయనకు కలిసి విన్నవించానన్నారు. అనంతగిరి కాఫీ పాయింట్ 77వ బ్లాక్ లో 2001 నుండి స్థానిక బీసుపురం, కొత్తవలస గ్రామాలకు చెందిన గిరిజనులు, చిరు వ్యాపారులు కాఫీ పొడి అట్టవీ ఉత్పత్తులు అమ్ముతూ జీవన ఉపాధి పొందుతున్నారన్నారు. 20. సంవత్సరాల పాటు నిత్యం అదే వృత్తిలో ఉంటూ 70. మంది గిరిజనులు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. . సుంకరమెట్ట తరహాలో ఉడెన్ వ్యూ పాయింట్ నిర్మిస్తే టూరిస్టులకు అలహాదకారంగా తిలకించేందుకు ఆశక్తి చూపుతారన్నారు. వ్యాపారులకు కొనుగోలు శక్తి పెరిగి జీవనోపాధి పొందుతున్నారన్నారు. అనుమతులు మంజూరు చేయాలని కోరామన్నారు ఈ కార్యక్రమంలో కొ్ర.మోహన్ చంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు

రూ.21 కోట్లతో బహుళ ప్రయోజన భవనాలు



మాట్లాడుతున్న ఎపిఒ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిఎం జన్ మన్ పథకంలో ఆదివాసీ గిరిజన (పివిటిజి) గ్రామాల్లో రూ.21 కోట్లతో 35 బహుళ ప్రయోజన భవనాలు నిర్మాణాలు జరుగుతున్నాయని ఐటిడిఎ ఎపిఒ (పివిటిజి) ఎం. వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శుక్రవారం ఐటిడిఎ వీడియో కాన్ఫరెన్సు హాలులో టిడబ్ల్యూ ఇంజనీరింగ్ అధికారులు, ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖ, వెలుగు అధికారులతో మల్టీ పర్పస్ భవన నిర్మాణాలు, వినియోగంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడేరు ఐటిడిఎ పరిధిలో 35 భవన నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. 6 భవనాలు నిర్మాణాలు పూర్తి చేసారని వాటిని వెంటనే సంబంధిత శాఖలకు అప్పగించాలని సూచించారు. మిగిలినవి భవనాలను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేసి సంబంధిత శాఖలకు అప్పగించాలని నిర్మాణ సంస్థలను ఆదేశించారు. భవనాలను ఎంపిడిఒలు పర్యవేక్షించాలని సూచించారు.

మొదటి దశలో 28 భవనాలు, రెండవ దశలో 7 భనాలు మంజూరయ్యాయన్నారు. అరకువ్యాలీ మండలానికి 3, డుంబ్రిగుడ 8, ముంచంగిపుట్టు 9, పెదబయలు 4, చింతపల్లి 4, పాడేరు 2, జికె.వీధి 2, జి.మాడుగుల 2, కొయ్యూరు మండలానికి 1 బహుళ ప్రయోజన భవనాలు మంజూరయ్యాని అన్నారు. ఆరు భవనాలు పూర్తయ్యాయని మిగిలిన భవనాలన్ని వివిధ నిర్మాణ దశలలో ఉన్నాయని పేర్కొన్నారు. నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలలో అంగన్వాడీ కేంద్రం, సబ్ సెంటర్, ప్రాథమిక పాశాల, వెలుగు, నైపుణ్య రంగాలలో వివిద శిక్షణా కార్యక్రమాలు, గ్రామంలోని వేడుకలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ ఒ టి.విశ్వేశ్వర నాయుడు, ఐటిడిఎ పరిపాలనాధికారి ఎం.హేమలత, ఎడిఎంహెచ్ ఒ ప్రతాప్, టిడబ్ల్యూ ఇఇ కె.వేణుగోపాల్, ఎఇ దుర్గా ప్రసాద్, 11 మండలాల ఎంపిడిఒలు, సిడిపిఒలు, ఎపి ఎంలు, ఎఇలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కాలేజీల్లో అడ్మిషన్ ఫీజులు తగ్గించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- పాడేరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ ఫీజులు తగ్గించాలని, ప్రతి బైపీసీ, ఎంపీసీ ఎంఈసి, సీఈసీ, హెచ్ సి ఈ, ఎంపీహెచ్డబ్ల్యు గ్రూపులో 20 చొప్పున ప్రతి కళాశాలలో సీట్లు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ శ్రీను డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ కార్యాలయం వద్ద శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, పాడేరు మండల కేంద్రంలో గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఈ నూతన సంవత్సరం అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేయాలని, అడ్మిషన్ ఫీజులు తగ్గించాలన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆదివాసి గిరిజన విద్యార్థిని విద్యార్థులకు డిగ్రీలో అడ్మిషన్ ఫీజులు భారం కాకూడదని తెలిపారు. పాడేరు ఏజెన్సీ 11 మండలాల్లో విద్యార్థినీ విద్యార్థులు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం జాయినింగ్ అవ్వడానికి ఫీజులు భారంగా ఉన్నందువలన చదువుకు దూరం అవ్వాల్సిన దుస్థితి ఈ రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాకూడదని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ ఫీజులు ఒక్కొక్క గ్రూపులో 2800 ఎంపీసీ బైపీసీ గ్రూపులో పెంచడం వలన ఇంటర్మీడియట్ లో ప్రవేశానికి విద్యార్థులు భయపడుతున్నారని తెలిపారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి విద్యార్థులంతా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పాంగి. చిన్నారావ్, గౌతం కుమార్, జగదీష్, చందు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

పిజిఆర్ఎస్‌కు 121 వినతులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ట్రైనీ కలెక్టర్ సాహిత్, డిఆర్ఒ కె.పద్మలతతో కలిసి మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులకు అందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలల మరమ్మతులకు ప్రతిపాదనలు సమర్పించాలని ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులకు సూచించారు. తల్లికి వందనం, చెక్ డ్యాం మరమ్మతులు, తాగునీటి సదుపాయాలు, రహదారుల నిర్మాణాలు, ఉద్యోగ అవకాశాల కోసం వినతులు సమర్పించారు. రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రామానికి చెందిన కె.శ్రీవల్లి తల్లికి వందనం పథకాన్ని వర్తింప చేయాలని వినతిపత్రం సమర్పించారు. పాడేరు మండలం గుత్తులపుట్టు గ్రామానికి చెందిన కూడా వెంకట రమణ కంప్యూటరీ ఆపరేటర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసారు. హుకుంపేట మండలం ఓల్డా పంచాయతీ నిమ్మల పాడు గ్రామంలో ఖాళీగా ఉన్న ఆశా వర్కరు పోస్టులో నియమించాలని దరఖాస్తును అందజేసారు. పాడేరు మండలం సలుగు పంచాయతీ ఈదుల పాలెం ఎంపిపి పాఠశాలలో 43 మంది పిల్లలు ఉన్నారని పైకప్పు లీకేజీ అవుతోందని మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు టి.రమణమ్మ, ఎం.రాజారావు వినతి పత్రం అందజేసారు. అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ బిజ్జి కంబవలస, జాకర వలస గ్రామాల చెక్ డ్యాం మరమ్మతులు చేపట్టి సాగునీరందించాలని టోకూరు సర్పంచ్ మెసియా వినతిపత్రం సమర్పించారు. హుకుంపేట మండలం కామయ్యపేట గ్రామానికి చెందిన కిల్లో చిట్టిబాబు తన ఇద్దరు పిల్లలకు తల్లికి వందన మంజూరు చేయాలని కోరారు. హుకుంపేట మండలం బారామసి పంచాయతీ నీలంపుట్టు గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు బి.పుష్పాలమ్మ, పి.పుష్పాంజలి, పి.పూర్ణమ్మ తదితరులు అటవీ హక్కు పత్రాల మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఎస్ డిసిఎం విఎస్ లోకేశ్వరరావు, డిఇఒ పి.బ్రహ్మాజీరావు, ట్రాన్స్ కో ఎస్ఇ ప్రసాద్, ఆర్ అండ్ బి ఇఇ బాల సుందరబాబు, టిడబ్ల్యూ ఇఇ కె.వేణు గోపాల్, ఐటిడిఎ పరిపాలనాధికారి ఎం.హేమలత, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత, ఎల్ డిఎం మాతునాయుడు, ఎస్ఎంఐ డిఇ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీ ప్లేన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



సీలేరు రిజర్వాయర్ పరిశీలిస్తున్న తహశీల్దార్ రామకృష్ణ

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా టూరిజం అభివృద్ధిలో భాగంగా సీలేరు నదిపై సీప్లేన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని దీనికి సంబంధించిన పనులు వేగవంతం చేయడానికి అన్నిచర్యలు చేపడుతున్నామని జికె వీధి తహశీల్దార్ రామకృష్ణ వెల్లడించారు. సీలేరు రిజర్వాయర్‌ను ఎపి జెన్‌కో అధికారులతో కలసి శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సీ ప్లేన్ ఏర్పాటుకు మొదటిదశగా 8 నెలల క్రిందట ఈ ప్రాంతాన్ని పరిశీలించామని దీనికి సంబంధించి డిపిఆర్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. సీలేరు మారేమ్మ అమ్మవారి ఆలయం ముందు ఫారెస్ట్ నర్సరీ ప్రదేశాల్లో సీ ప్లేన్ పర్యాటకులు దిగి వెళ్ళడానికి సీ ప్లేన్ పోర్ట్ నిర్మాణానికి స్థలం అనువుగా ఉందని అక్కడ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సీలేరు నదిపై మూడు కిలోమీటర్లు సీ ప్లేన్‌కు రన్‌వే అనుకూలంగా ఉందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు జోలాపుట్ అరకు వరకు లింక్ చేస్తూ అక్కడి నుంచి విశాఖపట్నం కైలాసగిరికి సీ ప్లేన్ చేరుకుంటుందన్నారు. సీ ప్లేన్‌కు వచ్చే యాత్రికులకు అవసరమైన ఎకరా స్థలాన్ని పరిశీలించడం జరిగిందని తహశీల్దార్ రామకృష్ణ వెల్లడించారు. దీనికి సంబంధించిన నివేదిక ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. దీని ఏర్పాటుకు ఎపి జెన్కో అధికారులు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానన్నారని నూతనంగా ఏర్పాటు చేసే పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు సీ ప్లేన్ ఏర్పాటు వలన ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఎపి జెన్కో అధికారులతో కలిసి పంపు స్టోరేజ్ నిర్మాణానికి సంబంధించి హద్దులు సీలేరు సమీపంలో పంపు స్టోరేజ్ డంపింగ్ యార్డ్ స్థలాన్ని పరిశీలించారు. పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి స్థాయి అటవీ అనుమతులు మరో 20 రోజుల్లో వస్తాయని ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకొని రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయుడు అప్పలరాజుకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఎడిఇ అప్పలనాయుడు, విఆర్ఒ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు
13లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిఇఒ ఎం ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన వివిధ యాజమాన్యాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు ఈనెల 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

4710 కేసులు పరిష్కారానికి గుర్తింపు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : జాతీయ, రాష్ట్రీయ న్యాయ సేవాప్రాధికార సంస్థల ఆదేశానుసారం విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలో ఈనెల 5న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు.

ఈ లోక్ అదాలత్‌లో 37 ప్రజా న్యాయ పీఠాలు జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసి కక్షిదారులకు ఖర్చు లేకుండా, సత్వర న్యాయం అందించనున్నట్లు తెలిపారు. బ్యాంకు చెక్కుల నిరాదరణ కేసులు, బ్యాంకు తగాదాలు, బీమా సంబంధిత కేసులు, కుటుంబ సంబంధిత కేసులు (విడాకుల కేసులు తప్ప), భూమి హక్కుల సంబంధిత కేసులు, రాజీ పడదగిన నేర సంబంధమైన కేసులు, ల్యాండ్ ఎక్విజేషన్ కేసులు, ప్రజా పాలన సంబంధిత కేసులు రాజీ చేయ నున్నట్లు తెలిపారు. జిల్లా. నగరంలోని కోర్టులతో పాటు, గాజువాక, అనకాపల్లి, ఎలమంచిలి, చోడవరం, పాడేరు, చింతపల్లి, నర్సీపట్నం, అరకు, మాడుగుల, భీమిలి పట్టణం తదితర కోర్టుల వద్ద ప్రజా న్యాయ పీఠాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు .ఈ లోక్ అదాలత్‌లో రాజీకి అనువైన 4710 కేసులు గుర్తించినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు తెలిపారు,

గ్రామస్థాయికి చంద్రబాబు మోసాలు

పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పాడేరు: చంద్రబాబు మోసాలు గ్రామస్థాయికి చేరవేయాలని శాసన సభ్యులు విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలపెట్టిన ష్యూరిటీ మోసం గ్యారంటీ" చంద్రబాబు మేనిఫెస్టోపై పాడేరు జిల్లా కేంద్రంలో వైసిపి అల్లూరి జిల్లా అధ్యక్షులు, పాడేరు శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులు మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ కురుసాల కన్నబాబు, అరకు పార్లిమెంట్ పరిశీలకులు .బొడ్డెడ ప్రసాద్, మాజీ శాసన సభ్యులు . కరణం ధర్మశ్రీ హాజరయ్యారు. ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం ఎన్నో అబద్ధాలు, హామీలు ఇచ్చిందన్నారు. ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయారన్నారు. ఈ ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాదు. ముంచే ప్రభుత్వం అని, రాష్ట్ర ప్రజలకు అర్థమైందని అన్నారు. గ్రామాల్లో కూటమి నాయకులు ప్రజలకు మొఖం చూపించుకోలేకపోతున్నారు. ప్రజలకు అండగా ఉంటూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ప్రతి గ్రామంలో ఎగిరేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గుమ్మ తనూజ రాణి , అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం, ఎమ్మెల్సీ ' కుంభ రవిబాబు, జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు , మాజీ శాసన సభ్యురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి , మాజీ పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి మాజీ జిసిసి ఛైర్పర్సన్ శోభ స్వాతి రాణి పాల్గొన్నారు.



ఎంపిటిసికి సమస్యలు చెబుతున్న విద్యార్థులు

700 మందికి 3 టాయిలెట్లు

- గురుకులం సమస్య పరిష్కరించాలని ఎంపిటిసికి విద్యార్థుల వినతి

ప్రజాశక్తి - కూనవరం: గురుకులంలో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు ఎంపిటిసి జయసుధ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు విన్నవించారు. శుక్రవారం కోతులగుట్ట గురుకులాన్ని వారు సందర్శించారు. గురుకులంలో మొత్తం 480 మంది స్కూల్ విద్యార్థులు, 220 మంది కళాశాల విద్యార్థులు మొత్తం 700 మంది ఉన్నారు. వీరికి 55 మరుగుదొడ్లు ఉండగా అందులో 3 మాత్రమే పనిచేస్తున్నాయని విద్యార్థులు వాపోయారు. 2 మోటార్లు ఉండగా అందులో ఒక్కటే పనిచేస్తోందని, కళాశాల విద్యార్థులకు సిబ్బంది సరిగా లేరన్నారు. మండలంలోని వరద బాధితుల్ని ఇక్కడి తరలించడం వల్ల 2 నెలలు విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. వారికి ప్రత్యేకంగా వసతి ఏర్పాటు ప్రభుత్వం చేయాలని డిమాండ్ చేసారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, అధ్యక్షులు పూనెం ప్రదీప్‌కుమార్, పాయం సీతారామయ్య, బాబు బొర్రయ్య, మేకల నాగేశ్వరావు, మడకం నాగమణి, పొడియం శ్రీరాములు, ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్ తదితరులు విద్యార్థుల సమస్యలు విన్నారు. పరిష్కారానికి సంబంధిత అధికారులు స్పందించి కృషి చేయాలని కోరారు.



కౌన్సిలింగ్ చేస్తున్న ఎస్ఐ శివకుమార్

పాత నేరస్తులకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - మోతుగూడెం : అల్లూరిజిల్లా, వై.రామవరం మండలం, డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో తెలంగాణ, ఎపిలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఎన్‌డిపిఎస్ చట్టం కింద నమోదైన కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న పాతనేరస్తులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డొంకరాయి ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదైతే పోలీస్‌స్టేషన్లో సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేసి వారిపై నిఘా ఉంచుతామని తెలిపారు. పిట్‌ఎండిపిఎస్ చట్టం ప్రకారం ఒక వ్యక్తి ఒకసారి ఎన్‌డిపిఎస్ చట్టం కింద అరెస్టు అయి, రెండోసారి అదే చట్టం కింద కేసు నమోదైతే ఎటువంటి కారణాలు లేకుండానే ఆ వ్యక్తిని ఒక సంవత్సరం పాటు జైలులో పెట్టే అధికారం పోలీసులకు ఉందని తెలిపారు. ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం కేసులో ముద్దాయిగా ఉంటే వారి ఆస్తులు సైతం జప్తు చేయడం జరుగుతుందన్నారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -సీలేరు: విద్యార్థినులు బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రవీంద్ర పిలుపునిచ్చారు. జికె వీధి మండలం సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. శక్తి యాప్ ఆవశ్యకత, పోక్సో ఇతర చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు అత్యవసర సమయంలో 100, లేక 112 నంబర్లకు ఫోన్ చేస్తే ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పోలీస్‌శాఖ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి వివరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే మీ దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

మన్యంలో ఘనంగా అల్లూరి జయంతి



అనంతగిరిలో నివాళులర్పిస్తున్న ఎంపిపి నీలవేణి తదితరులు



హుకుంపేటలో నివాళులర్పిస్తున్న వైస్ ఎంపిపి, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను స్థానిక మండల కేంద్రంలో అల్లూరి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న అల్లూరి విగ్రహానికి అల్లూరి యూత్ నాయకులు, టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు, టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం స్వామి, ఎంపీటీసీ ఎం సింహాద్రి తోపాటు పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి రాంబాబు రోగులకు, గర్భిణీలకు రొట్టెలు, అరటి పండ్లను సభ్యులు పంచిపెట్టారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు కే సూర్యప్రకాష్ కార్యదర్శి సభ్యులు ఉదయ్‌స్వరూప్, కె సూరి పాల్గొన్నారు.

అనంతగిరి : అనంతగిరి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ శెట్టి నీలవేణి ఆధ్వర్యంలో ఎంపీడీవో కె.ప్రభాకర్ సిబ్బంది అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఒ ఏ.వి.వి కుమార్, డిప్యూటీ ఎంపీడీవో పి.నర్సింగరావు, జూనియర్ అసిస్టెంట్ రాజమ్మ, సిఒ సత్య, ఓఎస్ సావిత్రి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు పాగి. అప్పారావు, వైఎస్ఆర్సిపి మండల ఉపాధ్యక్షుడు పాడి కృష్ణమూర్తి, మహిళా నాయకురాలు పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలో గిరిజన సంఘ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ వైస్ ఎంపిపి, సిపిఎం నాయకులు సూడిపల్లి కొండలరావు, గిరిజన సంఘ మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు మాట్లాడారు. కార్యక్రమంలో కంభ శ్రీను, మజ్జి రామకృష్ణ, దేముళ్ళు, మలిపరి చిట్టిబాబు, చిట్టం రామ్మూర్తి, కంబిడి రమణ పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, ఆశ్రమ పాఠశాలల్లో అల్లూరి జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలుర రెసిడెన్సియల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ శంకర్‌రావు నివాళులర్పించారు. వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు.

కూనవరం: మండలంలోని టేకుల బోర్ సెంటర్‌లో అల్లూరి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఆదివాసి గిరిజన సంఘం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ గిరిజన సంఘం నాయకులు జిల్లా అధ్యక్షులు ప్రదీప్, జిల్లా నాయకులు మడకం నాగమణి, పోడియం శ్రీరాములు, ఎస్ఎఫ్ఐ నాయకులు సోడె వినోద్ మేకల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.


చింతూరు: చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ శేఖర్ అధ్యాపకులు డాక్టర్.వై.పద్మ, అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు: జికెవీధి మండలం సీలేరులో అల్లూరి జయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ప్రిన్సిపల్ శంకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక పోస్టాఫీస్ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎపి జెన్‌కో సివిల్ ఎస్ఇ చంద్రశేఖర్ ఇఇలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎపి జెన్‌కో ఇంజనీర్లు, కార్మికులు పాల్గొన్నారు.

వై.రామవరం: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఎంపిడిఒ బాపన్నదొర జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రాజవొమ్మంగి: అల్లూరి సీతారామరాజును అందరూ ఆదర్శంగా తీసుకోవాలని రాజువొమ్మంగి సిఐ సన్యాసినాయుడు, ఎస్ఐ నరసింహమూర్తి, టిడిపి జిల్లా నాయకులు శివరామరాజు చంద్రరాజు, తదితరులు అన్నారు. రాజవొమ్మంగిలో అల్లూరి సీతారామరాజు దాడి చేసిన పోలీస్‌స్టేషన్ వద్ద అల్లూరి విగ్రహానికి, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అల్లూరి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొయ్యూరు : అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా రాజేంద్రపాలెం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఎంవివి. ప్రసాద్, సిపిఎం కార్యదర్శి సూరిబాబు సర్పంచ్ సింహద్రి తదితరులు పాల్గొన్నారు.



కూనవరంలో నివాళులర్పిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్



రాజఒమ్మంగిలో నివాళులర్పిస్తున్న సిఐ, ఎస్ఐ, టిడిపి నాయకులు

మండల సమావేశానికి అధికారులు గైర్హాజరు

ఎంపిటిసి సభ్యులు నిరసన, వాకౌట్

ఎంపిడిఒ స్పందనతో సమావేశం పున:ప్రారంభం

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మారేడుమిల్లి మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశానికి మండలస్థాయి అధికారులు హాజరు కాకపోవడంతో ఎంపిపి, ఎంపిటిసి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసి నిరసన తెలిపారు. అనంతరం వాకౌట్ చేయడానికి సిద్ధమవగా, ఎంపిడిఒ తూతిక శ్రీనివాస్‌విశ్వనాథ్ జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది. మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కుమారు సార్ల లలితకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయం సమీక్ష సమావేశం మందిరంలో శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యమైన శాఖల మండలస్థాయి అధికారులు గైర్హాజరు కావడంతో ఎంపిటిసి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్వసభ్య సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవడానికి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కి ఫిర్యాదు చేయాలని ఎంపిపి లలితకుమారి ఎంపిడిఒ శ్రీనివాస్‌విశ్వనాథ్‌కి సూచించారు. ఎంఇఒ ముత్యాలరావు మాట్లాడుతూ మండలంలో పాఠశాల భవనాలు లేని గ్రామాల్లో భవనాలు నిర్మిస్తారని ఈనెల 10వ తేదీన అన్ని పాఠశాలలో మెగా పిటిఎం పండుగ వాతావరణంలో నిర్వహిస్తామని తెలిపారు. వెలుగు ఎపిఎం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మండలంలో హోమ్ స్టే, వెదురు పెంపకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామని మండలంలోని వెయ్యి మంది మహిళ రైతులను గుర్తించామని తెలిపారు. మండల ప్రత్యేక అధికారి డిఇ ట్రైబల్ వెల్ఫేర్ చైతన్య మాట్లాడుతూ ఆకుమామిడికోటలో ట్రైబల్ మల్టీపర్పస్ మాల్‌ను నిర్మిస్తామని, సున్నంపాడు నూరుపూడి వంతెనకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని,వాలమూరు, కడుమూరు కొండవాగులపై వంతెన నిర్మిస్తారని తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు మండలస్థాయి అధికారులు హాజరయ్యారు.



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న మండల సిపిఎం కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

సిగ్నల్స్ ఇవ్వండి .. లేదా టవర్లు పీకేయండి

ప్రజాశక్తి - వి.ఆర్.పురం: మండల పరిధిలో దాదాపు ఏడు బిఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, జియో టవర్లు ఉన్నా సిగ్నల్స్ లేక మండల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని మండల సిపిఎం కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ అన్నారు. అసలే వరదలు వచ్చే సమయం ఆసన్నమైంది. ఈ సమయంలో వరదనీట గురించి ఏ సమాచారమైనా అవసరమైతే ఎలా తెలుస్తుందన్నారు. సిగ్నల్స్ వచ్చేలా చేయండి లేదంటే టవర్లు పీకేసి పట్టుకుపోండి అన్నారు. సెల్ స్నిగ్నల్స్ వచ్చేలా చర్యలు చేపట్టాలని లేకపోతే త్వరలోనే అన్ని టవర్ల వద్ద భారీ ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కమిటి సభ్యులు సోయం చినబాబు, ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్ మండల కమిటి సభ్యులు పొడియం శ్రీరామమూర్తి పంకు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.